పోచమ్మ ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

పోచమ్మ ఆలయంలో పూజలు చేసిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సదాశివపేట, నవంబర్ 14: మండల పరిధిలోని నిజాంపూర్‌లో నూతనంగా నిర్మించిన పోచమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి గురువారం ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు చింతా ప్రభాకర్‌ను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ మాజీ ఎంపీటీసీ మాధవరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గడీల సుధీర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెద్దగొల్ల ఆంజనేయులు, మాజీ సర్పంచ్‌లు కరుణాకర్, నాయకులు కుమ్మరి నర్సింహులు, చిక్కుల మల్లేశం పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు ప్రదానం

క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేస్తున్న పటాన్‌చెరు సీఐ ప్రవీణ్‌రెడ్డి

పటాన్‌చెరు, నవంబర్ 14: మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల కళాశాల ముత్తంగిలో జిల్లాస్థాయి క్రీడాపోటీల ముగింపు సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేశారు. గురువారం పటాన్‌చెరు సీఐ ప్రవీణ్‌రెడ్డి, ఎంఈవో నాగేశ్వర్‌నాయక్ ముఖ్యఅతిథులుగా హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అన్ని విభాగాల్లో ప్రతిభను చాటిన చింతమడక స్కూల్‌కు ఓవరాల్ చాంపియన్ షీల్డ్ అందజేశారు. వ్యక్తిగత పోటీల్లో హవేలిఘనపూర్ చాంపియన్‌గా నిలిచింది. ఈ సందర్భంగా సీఐ ప్రవీణ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ క్రీడల్లో ప్రావీణ్యతను సంపాదించాలన్నారు. క్రీడలతో మానసిక, శారీరక ధృఢత్వం సిద్ధిస్తుందన్నారు. విద్యార్థులు డ్రగ్స్‌తో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. క్రీడలతోపాటు విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నవనీత, డీఆర్‌డీఏ ఏపీఎం డాక్టర్ శ్రీనివాస్, జేకే ఫెన్నార్ పరిశ్రమ ప్రతినిధులు గోకరాజు, సంతోషి, అధ్యాపకులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లిస్తాం: డీపీవో

కోహీర్‌లో మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి జానకిరెడ్డి

కోహీర్, నవంబర్ 14: నాలుగు నెలల నుంచి వేతనాలు చెల్లించడం లేదని కోహీర్‌కు చెందిన 23మంది పారిశుధ్య కార్మికులు నాలుగు రోజులుగా చేపట్టిన సమ్మెను గురువారం విరమించారు. కోహీర్ పంచాయతీ ఆవరణలో నిరసన వ్యక్తం చేస్తున్న విషయం తెలుసుకున్న జిల్లా పంచాయతీ అధికారి జానకిరెడ్డి పారిశుధ్య కార్మికులతో మాట్లాడారు. కార్మికులకు వెంటనే వేతనాలు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. దీంతో సమ్మెను విరమించి విధులకు హాజరయ్యారు. అనంతరం సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఎన్యూమరేటర్లకు డీపీవో సూచించారు. కోహీర్‌లో చేపట్టిన సర్వేను పరిశీలించారు. డీపీవో వెంట డీఎల్‌పీవో అమృత, ఎంపీవో వినోద్ కుమార్, కార్యదర్శి మిస్కీన్ తదితరులున్నారు.

మున్సిపల్ కార్మికుల బకాయిలు చెల్లించాలి

జహీరాబాద్ మున్సిపల్ ఆవరణలో సమ్మె చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు

జహీరాబాద్, నవంబర్ 14: జహీరాబాద్ మున్సిపల్‌లో పనిచేసే కాంట్రాక్టు కార్మికులకు చెల్లించాల్సిన పీఎఫ్, ఈఎస్ఐ బకాయిలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మహిపాల్ డిమాండ్ చేశారు. గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయ ఆవరణలో కార్మికులు సమ్మెను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికులకు న్యాయపరంగా రావాల్సిన పీఎఫ్, ఈఎస్ఐ బిల్లుల విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. ఈ విషయంలో మున్సిపల్ కమిషనర్‌తో జరిగిన చర్చలు విఫలం కావడంతో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. పీఎఫ్, ఈఎస్ఐ బిల్లులతోపాటు పీఎఫ్ విత్‌డ్రాలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ కార్మిక సంఘం నాయకులు కామయ్య, యశోదమ్మ, మోహన్, చంటి, కాంతమ్మ, నాగమ్మ, కార్మికులు పాల్గొన్నారు.

క్రైస్తవులకు అన్నదానం

మనియార్‌పల్లిలో అన్నదానం చేస్తున్న పీచెర్యాగడి మాజీసర్పంచ్ రవికిరణ్

కోహీర్, నవంబర్14: వికారాబాద్ జిల్లా దారూర్‌లో కొనసాగుతున్న క్రైస్తవ జాతరకు పాదయాత్రగా వెళ్తున్న భక్తులకు గురువారం మనియార్‌పల్లిలో జహీరాబాద్‌కు చెందిన జనతా గ్యారేజీ బృందం, పీచెర్యాగడి మాజీ సర్పంచ్ రవికిరణ్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో మనియార్‌పల్లి, పీచెర్యాగడి మాజీ సర్పంచులు వెంకట్రాంరెడ్డి, రవికిరణ్, బీఆర్ఎస్ నాయకులు, బండిమోహన్, ఎర్రోళ్ల శివప్ప, మధు, సంతోశ్, నవీన్, ప్రసాద్, కుమార్, ఏసు, సంజు, తదితరులు పాల్గొన్నారు.

ఇండస్ట్రియల్ టూర్‌కు జేఎన్టీయూ విద్యార్థులు

ఇండస్ట్రియల్ టూర్‌కు వెళ్తున్న విద్యార్థులు

చౌటకూర్, నవంబరు 14: మండలంలోని సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు గురువారం ఇండస్ట్రియల్ టూర్‌కు వెళ్లారు. పటాన్‌చెరు మండలం పాశమైలారం పారిశ్రామిక ప్రాంతంలోని కిర్బీ పరిశ్రమను సందర్శించేందుకు కళాశాలలో నాలుగో ఏడాది సివిల్ ఇంజినీరింగ్ విద్యనభ్యసిస్తున్న విద్యార్థినీ, విద్యార్థులు అధ్యాపకులతో కలిసి వెళ్లారు. పరిశ్రమలో భవన నిర్మాణ విధానాన్ని విద్యార్థులు పరిశీలించారు. పరిశ్రమలోని వివిధ విభాగాల్లో జరుగుతున్న పనులు, యంత్రాలతో ఇనుము, వంతెనల నిర్మాణం, మెట్రో రైల్వే స్టేషన్ల నిర్మాణానికి ఉపయోగించే ఇనుము విడిభాగాల గురించి పరిశ్రమ ఇంజినీర్లను అడిగి తెలుసుకున్నారు. దేశంలో కేవలం మూడు ప్రాంతాల్లో మాత్రమే కిర్బీ పరిశ్రమలు ఉన్నాయి. సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామిక ప్రాంతంలో పరిశ్రమ ఉన్నదని ఇంజినీర్లు వివరించారు. తమ ప్రాంతంలో కిర్బీ పరిశ్రమ నెలకొల్పడం గర్వకారణమన్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా వందలాది మంది నిరుద్యోగ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తూ పరిశ్రమ దినదినాభివృద్ధి చెందుతున్నదన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నరసింహ, అధ్యాపకులు, సిబ్బంది తదిత రులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

- వైద్యారోగ్య శాఖల మంత్రి దామోదర రాజనర్సింహ

విజేతలకు బహుమతులు అందజేస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ

అందోల్, నవంబర్ 14: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని, క్రీడల వల్ల మానసిక ఉల్లాసంతో పాటు స్నేహభావం పెంపొందుతుందని వైద్యారోగ్య శాఖల మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. గురువారం అందోల్ గురుకుల పాఠశాలలో నిర్వహించిన స్పోర్ట్స్‌మీట్, చిల్డ్రన్ డే వేడుకల్లో పాల్గొన్న మంత్రి జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడాకారులతో కలిసి కబడ్డీ ఆడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమని, గెలిచినా ఓడినా క్రీడలను నిర్లక్ష్యం చేయవద్దన్నారు. గురుకుల పాఠశాలలో లైబ్రరీ ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం క్రీడల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం నర్సింగ్ కళాశాల పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ తిరుపతి, ఏఎంసీ చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, తహసీల్దార్ విష్ణుసాగర్, ప్రిన్సిపాల్ సద్గుణ మేరీ పాల్గొన్నారు.

పిల్లలకు బాల్యం చాలా విలువైనది

- కలెక్టర్ వల్లూరు క్రాంతి

బాలల దినోత్సవంలో భాగంగా చిన్నారులతో కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 14: పిల్లలకు బాల్యం చాలా విలువైనదని కలెక్టర్ వల్లూరు క్రాంతి పేర్కొన్నారు. గురువారం స్థానిక సహారా ప్రైమరీ రిహబిలిటేషన్ సెంటర్‌లో నిర్వహించిన బాలల దినోత్సవంలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చిన్నారులకు పువ్వులు, పుస్తకాలు, చాక్లెట్లు అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. పిల్లల సంతోషమే మన అభివృద్ధికి కీలక చిహ్నమని, అందుకే వారి బాల్యాన్ని పరిరక్షించాలనే కర్తవ్యాన్ని మనందరం నెరవేర్చాలని పేర్కొన్నారు. సమాజంలో ప్రతిఒక్కరూ పిల్లలకు అందుతున్న సేవల్లో తమవంతు బాధ్యతగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రిహబిలిటేషన్‌లో ఉన్న 30 మంది దివ్యాంగ పిల్లలకు సేవందించడం మానవత్వానికి నిదర్శనమని నిర్వాహకులను అభినందించారు. మానసిక దివ్యాంగులకు ప్రత్యేక కౌన్సెలింగ్, ప్రోత్సాహక కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా వారి ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సెంటర్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

హత్నూర, నవంబర్ 14: పన్యాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ మాధురి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..కొనుగోలు కేంద్రాల్లో వసతులు కల్పించి, ఎప్పటికప్పుడు ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. కేంద్రాల వద్ద ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ధాన్యం వివరాలను ట్యాబ్‌లో నమోదు చేసి సకాలంలో రైతులకు డబ్బులు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం బోర్పట్ల శివారులో ప్రారంభించిన పత్తి బిన్నింగ్ మిల్లును సందర్శించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఫర్హీన్ షేక్, ఏపీఎం దేవేందర్, సీసీ మహేశ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ అధికారులపై దాడి అమానుషం

- ఉద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో నిరసనలు

కలెక్టరేట్ నుంచి ర్యాలీ ప్రారంభిస్తున్న ఉద్యోగ జేఏసీ నాయకులు, ఉద్యోగులు

సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 14: ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులపై దాడులు అమానుష చర్యగా ఉద్యోగ సంఘాల నాయకులు ఖండించారు. గురువారం భోజన విరామ సమయంలో ఉద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ నుంచి ర్యాలీ ప్రారంభి నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా టీజాక్ అధ్యక్షుడు ఎండీ జావేద్ అలీ మాట్లాడుతూ.. వికారాబాద్ జిల్లా కలెక్టర్, రెవెన్యూ అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు, నాలుగో తరగతి ఉద్యోగులు, డ్రైవర్లపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వం ఏ కార్యక్రమం చేపట్టినా విజయవంతం చేసేందుకు అధికారులు, ఉద్యోగులు బాధ్యతగా పనిచేస్తున్నట్లు చెప్పారు. ఇకపై ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు బొమ్మ రాములు, వైధ్యనాథ్, జగదీశ్, శ్రీకాంత్, వెంకట్‌రెడ్డి, వెంకటేశం, ప్రమోద్, షకీల్, బలరాం, శ్రీనివాస్, నవాజ్ పాల్గొన్నారు.

ఫైర్ సేఫ్టీపై అందరికీ అవగాహన ఉండాలి

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న బీడీఎల్ సీఐఎస్ఎఫ్ అధికారులు

పటాన్‌చెరు, నవంబర్ 14: ఫైర్ సేఫ్టీపై అందరికీ అవగాహన ఉండాలని సీఐఎస్ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్/ఫైర్ ఏఎస్ఐ సుబ్బయ్య, దేవసోత్ గణేశ్, రమేశ్ అన్నారు. గురువారం పటాన్‌చెరు మండలం భానూర్ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీఐఎస్ఎఫ్ బీడీఎల్ యూనిట్, ఫైర్ విభాగం ఆధ్వర్యంలో ఫైర్ సేఫ్టీపై, డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు ఎలా సంభవిస్తాయి, ఎలా నివారించాలి ప్రత్యక్ష్యంగా చూపించారు. విపత్తు సమయంలో ప్రాణనష్టం లేకుండా ముందుగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆస్తినష్టం తగ్గించేందుకు కృషి చేయాలన్నారు. ప్రమాదాలు ఏదో రూపంలో మన చుట్టూ ఎప్పుడు ఉంటాయన్నారు. అప్రమత్తంగా ఉండటంతోపాటు ప్రమాదం జరిగేతే తక్షణం స్పందించేలా అవగాహనతో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో హెడ్మాస్టర్ దక్ష్యాయని, డిప్యూటీ కమాండెంట్ సంతానకృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

జెండావిష్కరణలో పాల్గొన్న మేనేజర్ రాజనర్సింహులు, సిబ్బంది

పుల్కల్, నవంబర్ 14: రైతులు డీసీసీబీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని బ్రాంచ్ మేనేజర్ రాజనర్సింహులు అన్నారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు వారోత్సవాల్లో భాగంగా గురువారం మండలకేంద్రంలోని సహకార బ్యాంకు ఎదుట జెండావిష్కరణ చేశారు. అనంతరం మేనేజర్ మాట్లాడుతూ జిల్లా సహకార బ్యాంకు అందిస్తున్న సేవలను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర బ్యాంకుల కంటే డీసీసీబీలో తక్కువ వడ్డీకే గోల్డ్‌లోన్ సౌకర్యం ఉన్నందున రుణాలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ చారి, ఫీల్డ్ ఆఫీసర్ మురళీ కృష్ణ, అసిస్టెంట్ మేనేజర్ మురళి, ముఖీమ్, ప్రశాంత్, అనీల్, శారద పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

కరపత్రాన్ని విడుదల చేస్తున్న వైద్యాధికారులు

ఝరాసంగం, నవంబర్ 14: ఉచిత పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి హర్షవర్ధన్‌రెడ్డి, శాస్త్రవేత్త డా.కైలాస్ పాడి రైతులకు సూచించారు. గురువారం మండలపరిధిలోని చిలే మామిడిలో పశుగణాభివృద్ధి, పశు సంవర్ధక శాఖ, డీడీఎస్, కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. పశు వైద్యాధికారి మాట్లాడుతూ... గోపాలమిత్ర సేవలను వినియోగించుకుంటూ పశువులు రోగాలబారిన పడకుండా పాడి రైతులు ముందు జాగ్రత్తగా టీకాలు వేయించాలన్నారు. కార్యక్రమంలో గోపాల మిత్ర సూపర్‌వైజర్ అర్జునయ్య, వోఎస్ శివకుమార్, కృష్ణ, రాములు, రమేశ్, శ్రీకాంత్, అశోక్, శ్రీనివాస్, పాడి రైతులు పాల్గొన్నారు.

రోడ్ల మరమ్మతులకు చర్యలు

- రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

జహీరాబాద్‌లో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

జహీరాబాద్, నవంబర్ 14: రోడ్ల మరమ్మతులకు చర్యలు తీసుకుంటున్నామని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. మహారాష్ట్రలోని షోలాపూర్‌లో ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు గురువారం జహీరాబాద్ పట్టణానికి వచ్చారు. పార్టీ సీనియర్ నాయకుడు ఉజ్వల్‌రెడ్డి స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. ఈ ఏడాది దెబ్బతిన్న 12 వేల కిలోమీటర్ల మేర రోడ్లకు మరమ్మతులు చేపట్టామన్నారు.పైసా పైసా కూడబెట్టి ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. జహీరాబాద్ పట్టణంలో మోడల్ ప్రభుత్వ అతిథి గృహాన్ని నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డి, సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, ఉజ్వల్‌రెడ్డి, రామలింగరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేయాలి

- అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

పుల్కల్ కస్తూర్బా పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

పుల్కల్, నవంబర్ 14: విద్యార్థుల అభ్యున్నతి కోసం ఉపాధ్యాయులు కృషి చేయాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. గురువారం బాలల దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని పలు హాస్టళ్లను అదనపు కలెక్టర్ పరిశీలించారు. మండలకేంద్రంలో ఉన్న కస్తూర్బా బాలికల వసతి గృహాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి బాలల దినోత్సవంలో పాల్గొన్నారు. సింగూరు బాలుర గురుకుల పాఠశాల, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ కల్యాణ్ చక్రవర్తి, కస్తూర్బా పాఠశాల ఎస్‌వో ఇందిరా, ఉపాధ్యాయ బృందంతో మాట్లాడారు. వసతి గృహాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలన్నారు. పాఠశాలలో ఉన్న మౌలిక వసతులపై ఆరా తీశారు. విద్యార్థులతో మాట్లాడుతూ గ్రంథాలయం, కంప్యూటర్ ల్యాబ్ సౌకర్యాలు ఉన్నాయా అని అడిగారు.పాఠశాలల్లో సమస్యలు ఉంటే మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఆయన వెంట స్పెషలాఫీసర్ బాల్‌రాజ్, ఎంఈవో శంకర్, ఎంపీవో శ్రీకాంత్, ఏపీవో సంతోశ్ ఉన్నారు.

చలో సంగారెడ్డిని విజయవంతం చేయాలి

హత్నూర, నవంబర్14: సంగారెడ్డి పీఎస్ఆర్ గార్డెన్‌లో శనివారం నిర్వహించనున్న మాలల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని మాల మహానాడు హత్నూర మండల అధ్యక్షుడు రాజీవ్‌గాంధీ కోరారు. గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మాలల హక్కుల సాధన, రిజర్వేషన్ల పరిరక్షణ కోసం నిర్వహించ తలపెట్టిన కార్యక్రమానికి పలువురు ఎమ్మెల్యేలు, నాయకులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. సంగారెడ్డి పీఎస్ఆర్ గార్డెన్‌లో ఉదయం నిర్వహించే కార్యక్రమానికి జిల్లావ్యాప్తంగా మాలలు అధికసంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రభు, సుధాకర్, నర్సింహులు, అమృతరావు, మహిపాల్, సంజీవ్ పాల్గొన్నారు.

ప్రభుత్వభూమిలో వంద ఫీట్ల రోడ్డు నిర్మాణం

- పనులను అడ్డుకున్న జిన్నారం గ్రామస్తులు

జిన్నారంలో ప్రైవేటువెంచర్‌కు నిర్మిస్తున్న రోడ్డును అడ్డుకుంటున్న గ్రామస్తులు

జిన్నారం, నవంబర్ 14: జిన్నారం శివారులోని సర్వే నంబర్ 1002 ప్రభుత్వ భూమి లోంచి ఊట్ల రెవెన్యూ పరిధిలోని ప్రైవేటు వెంచర్‌కు రోడ్డు వేసేందుకు జరుగుతున్న పనులను జిన్నారం గ్రామస్తులు గురువారం అడ్డుకున్నారు. ప్రభుత్వ భూమిలో నుంచి వెంచర్‌కు రోడ్డును ఎలా నిర్మిస్తారని గ్రామస్తులు ప్రశ్నించారు. పనులు వెంటనే నిలిపివేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ప్రణాళిక ప్రకారం ప్రైవేటు వెంచర్ కోసం వంద ఫీట్ల రోడ్డును నిర్మిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి మద్దతుగా నిలవడం దురదృష్టకరమన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలను అడ్డం పెట్టుకుని కొందరు స్థానిక నాయకులు ప్రైవేటు వెంచర్‌కు సహకరిస్తున్నారని, బడా నాయకుల భూముల్లోకి వెళ్లేందుకే గ్రామ శివారులో ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ పాఠశాలలను ఏర్పాటు చేశారని ఆరోపించారు. రోడ్డు పక్కన జూనియర్ కళాశాల ఏర్పాటు చేయల్సి ఉండగా ఆ స్థానంలో మినీస్టేడియం ఏర్పాటు చేసి జూనియర్ కళాశాలను దూరంగా నిర్మించారన్నారు. ప్రభుత్వ భూములో రోడ్డు ఏర్పాటు చేస్తున్నా రెవెన్యూ అధికారులు అడ్డుకోకపోవడంపై పలు అనుమానాలకు తావిస్తోందని గ్రామస్తులు అన్నారు.

దగ్ధమైన కిరాణా షాపు పరిశీలన

నారాయణఖేడ్, నవంబర్ 14: నారాయణఖేడ్ మండలం ర్యాకల్‌లో కడపల నర్సింహులుకు చెందిన కిరాణాషాపు షార్ట్ సర్క్యూట్ తోదగ్ధమైంది. విషయం తెలుసుకున్న జిల్లా ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ కమిటీ మాజీ సభ్యుడు రవీందర్‌నాయక్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సింహులును పరామర్శించి, ధైర్యం చెప్పారు. సంఘటన జరిగిన తీరుపై ఆరాతీయడంతో పాటు ప్రమాదంలో రూ.4 లక్షల నష్టం జరిగిన విషయాన్ని తెలుసుకుని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు అంజాగౌడ్, అంజన్న, సాయాగౌడ్, విఠల్, రాములు, నర్సింహులు, మల్లన్న, పండరీ ఉన్నారు.

రేపు సర్టిఫికెట్ల వెరిఫికేషన్

సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 14: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న సీఆర్టీ, పీజీసీఆర్టీ, పీఈటీ పోస్టులకు సంబంధించి 1:3మెరిట్ అభ్యర్థులు శనివారం ఉదయం 10గంటల్లోగా కలెక్టరేట్‌లోని సమగ్ర శిక్ష కార్యాలయంలో హాజరుకావాలని డీఈవో వెంకటేశ్వర్లు గురువారం ప్రకటనలో తెలిపారు. మెరిట్ లిస్ట్ వివరాలను జిల్లా విద్యాశాఖ వైబ్‌సైట్ sangareddy.telanagana.gov.in లో పొందుపర్చామని చెప్పారు.

సహకార వారోత్సవాలు

సహకార వారోత్సవాల్లో జెండా ఆవిష్కరిస్తున్న బ్యాంకు అధికారులు

జెండాను ఆవిష్కరిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ నంద్యాల విష్ణువర్ధన్‌రెడ్డి

సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 14: కాకతీయ కోఆపరేటీవ్ బ్యాంక్ ఆధ్వర్యంలో గురువారం సహకార వారోత్సవాలు ప్రారంభించారు. బ్యాంక్ మేనేజర్ మొగులయ్య జెండాను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఈ నెలలో సిల్వర్‌జూబ్లీ వేడుకలు ముగుస్తాయని తెలిపారు. బ్యాంకులో డిపాజిట్లకు సంబంధించి కనీస డిపాజిట్ రూ. 5 లక్షలకు 10శాతం వడ్డీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. బ్యాంకులో లాకర్, లోన్ సౌకర్యాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ ఆర్ఎంవీ గోపాల్, అధికారులు మహేందర్, రమ్య, లావణ్య, వెంకయ్య, ఖాతాదారులు తదితరులు పాల్గొన్నారు.

గుమ్మడిదలలో....

గుమ్మడిదల, నవంబర్ 14: మండల కేంద్రంలో 71వ అఖిలభారత సహకార వారోత్సవాల్లో భాగంగా పీఏసీఎస్ చైర్మన్, డైరెక్టర్లు వారోత్సవాలను నిర్వహించారు. మండలంలోని పీఏసీఎస్ కార్యాలయం వద్ద చైర్మన్ నంద్యాల విష్ణువర్ధన్‌రెడ్డి, సీఈవో లచ్చిరాం నాయక్ ఆధ్వర్యంలో జెండాను ఎగురవేసి వారోత్సవాలను నిర్వహించారు. పీఏసీఎస్ ఏర్పాటుతో రైతులకు మేలు జరిగిందని చైర్మన్ విష్ణువర్ధన్‌రెడి అన్నారు. వీరితో పాటు పీఏసీఎస్ డైరెక్టర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

డయల్ యువర్ డీఎం

రామచంద్రాపురం, నవంబర్ 14: బీహెచ్ ఈఎల్ డిపో నుంచి తిరుపతి, చెన్నై, విశాఖపట్నం, కాకినాడ, అమలాపురం, శ్రీశైలం, గుంటూరు, చీరాల రూట్లలో సూపర్ లగ్జరీ, రాజధాని, లహరి బస్సులు నడుపుతున్నామని డీఎం సుధ తెలిపారు. ప్రయాణికులు దూర ప్రాంత సర్వీసుల గురించి ఏమైనా సూచనలు, సలహాలు ఇచ్చేందుకు డయల్ యువర్ డీఎంలో పాల్గొన్నాలని గురువారం ప్రకటనలో తెలిపారు. డయల్ యువర్ డీఎం కోసం 9959226149 నంబర్‌కు ఉదయం 11.30 నుంచి 12.30వరకు కాల్ చేసి సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

జహీరాబాద్, నవంబర్ 14: అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేటు దవాఖానల్లో చికిత్స పొందిన నిరుపేదలకు సీఎం సహాయ నిధి ఎంతో భరోసానిస్తుందని నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు అన్నారు. గురువారం జహీరాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి డా.చంద్రశేఖర్ సీఎం సహాయనిధి కింద జహీరాబాద్ నియోజకర్గంలోని ఆయా మండలాలకు చెందిన లబ్ధిదారులు మంజూరైన రూ.3.30 లక్షల చెక్కులను అందజ